క్లుప్తంగా

రైతులకు చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో రైల్వే డబుల్ లైన్ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ ఎస్.రామలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నంచర్ల గ్రామం నుంచి గుంతకల్లు వరకు రైల్వే డబుల్ లైన్ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు ఎకరానికి రూ.7 లక్షల ప్రకారం పరిహారం అందించినట్లు తెలిపారు. గ్రామంలో 9 మంది రైతులకు రూ 6.43 లక్షల చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వీఆర్‌ఓలు మల్లికార్జున, రంగన్న, తదితరులు ఉన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ, స్కిల్ హబ్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ వై.సుధాకర్‌బాబు బుధవారం తెలిపారు. కళాశాలలో ఇప్పటివరకు 7 బ్యాచ్‌లు శిక్షణను పూర్తి చేసుకున్నాయన్నారు. పదవ తరగతి నుండి ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసుకొన్న 30 సంవత్సరాల్లోపు అభ్యర్థులు సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో పాటు ఒక పాస్ ఫొటోతో ఈనెల 16వ తేదీలోగా స్థానిక కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరకాస్తు చేసుకున్న వారికి సోమవారం నుంచి శిక్షణ తరగతులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 88859 04099ను సంప్రదించాలన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

తుగ్గలి: మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించేలా సిఫార్సు చేసి రైతులను ఆదుకోవాలని అఖిలపక్ష పార్టీల నాయకులు కరువు బృందానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం కరువు పరిశీలనకు పత్తికొండకు వెళుతున్న కరువు బృందానికి రైతుల పరిస్థితులను ఏకరువు పెట్టారు. నీతి అయోగ్ రీసెర్చ్ ఆఫీసర్, కరువు బృందం టీం లీడర్ అనురాధ బట్నా బృందానికి జొన్నగిరిలో వినతి పత్రం అందజేశారు. నాయకులు నబి రసూల్, సుల్తాన్, వెంకటేశ్వర్లు, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



హొళగుంద: మండల కేంద్రంలో వెలసిన దక్షిణామూర్తి స్వామి ఆలయంలో బుధవారం కార్తీక మాసం పురస్కరించుకుని దీపోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం ఆలయాల్లో స్వామి వార్లకు పూజారులు రుద్రాభిషేకం, మహామంగళారతి, నైవేద్య సమర్పణ, ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వరిగడ్డి ట్రాక్టర్‌కు నిప్పు



ట్రాక్టర్‌లో తరలిస్తున్న గడ్డికి నిప్పంటుకున్న దృశ్యం

హొళగుంద: మండల పరిధిలోని హొన్నూరు కొట్టాల సమీపంలో బుధవారం వరిగడ్డితో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగలడంతో నిప్పంటుకుని గడ్డి పూర్తిగా కాలి బూడిదైంది. హొళగుందకు చెందిన రైతులు కుమారస్వామి, వీరేశ్ పొలంలోని వరిగడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు గడ్డికి తగిలాయి. నిప్పురవ్వలు పడి మంటలు అంటుకోవడంతో తేరుకున్న ట్రాక్టర్ డ్రైవర్ ట్రాలీ లిఫ్ట్ ఎత్తి కాలుతున్న గడ్డిని కిందకు పడేశారు. ట్రాక్టర్ ట్రాలీ పాక్షికంగా దెబ్బ తినగా వరి గడ్డి పూర్తిగా కాలిపోయింది.

వైభవంగా రథోత్సవం



పార్లపల్లి వీధుల్లో స్వామి వారి రథోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం సీతారామాంజనేయ స్వామి రథోత్సవం కనులపండువగా జరిగింది. ఉదయం స్వామివారికి కళ్యాణం జరిపించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు చంద్రశేఖర్ రెడ్డి ఇంటి నుంచి పూర్ణకుంభంతో వచ్చి రథోత్సవం ముందు హోమం నిర్వహించారు. భక్తుల కోలహాలం నడుమ రథోత్సవం గ్రామ వీధుల్లో సాగింది. సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, వీరశైవ లింగాయితీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి, కేఆర్.మురహరరెడ్డి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రూరల్ ఎస్‌ఐ సి.శరత్‌కుమార్, ఏఎస్‌ఐ బాలజీనాయక్ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీతో గ్రామ స్వరాజ్యం



దేవనబండలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: గ్రామ స్వరాజ్యం స్థాపన దిశగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. పత్తికొండ మండల పరిధిలోని దేవనబండ గ్రామంలో రూ.43 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.24 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, రూ.20.84 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లీనిక్‌తో పాటు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు సర్పంచ్ పొట్లపాటి ప్రవీణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గాంధిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ కార్యాలయాలను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. గ్రామస్తులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాల ద్వారా ప్రజలకు సత్వర సేవలందుతాయన్నారు. సిబ్బంది ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధిగా కృషి చేయాలని కోరారు. ఎంపీపీ నారాయణదాస్, ఎంపీటీసీ నీలకంఠ, వ్యవసాయ, వైద్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామనాయకులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం



నూతన కమిటీ సభ్యులకు డిక్లరేషన్ ఫారం అందిస్తున్న ఎన్నికల అధికారి డాక్టర్ స్వాతి

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక పశువైద్యశాలలో బుధవారం నిర్వహించిన వెల్దుర్తి బ్రహ్మగుండేశ్వర ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్నికల అధికారి, పుల్లగుమ్మి పశువైద్యాధికారి డాక్టర్ స్వాతి నిర్వహణలో జరిగిన ఎన్నికలో సంఘం అధ్యక్షుడిగా వెల్దుర్తి వైఎస్సార్‌సీపీకి చెందిన కురువ రాజశేఖర్, రత్నపల్లెకు చెందిన సీఎం మల్లికార్జున ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎంకే శ్రీనివాసులు, కె.జయన్న, బి.రామకృష్ణ, రవికుమార్, వై.దామోదర్, గొల్ల పెద్ద లింగమూర్తి ఎన్నికయ్యారు. ఉదయం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా మొత్తం 200 మంది సభ్యులకు గాను 76 మంది హాజరయ్యారు. నూతన కమిటీ ప్రతినిధుల నామినేషన్లను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎన్నికల అధికారి నూతన కమిటీ ప్రతినిధుల గెలుపును ప్రకటించి వారికి ఐదేళ్ల కాలపరిమితితో కూడిన ధ్రువీకరణ పత్రాలు అందించారు. నూతన కమిటీ బృందం తమ ఎన్నిక పట్ల సంఘం సభ్యులకు, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, బొమ్మన రవిరెడ్డి, బొమ్మన పెద్దిరెడ్డి, సుంకన్న, శివకు కృతజ్ఞతలు తెలిపారు.

కౌలు రైతులకు రుణాలు

మద్దికెర: మద్దికెర సహకార సంఘంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయనున్నట్లు చైర్‌పర్సన్ శాంతన్న, సీఈఓ నాగరాజు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. కౌలు రైతులకు ప్రభుత్వం జారీ చేసిన ఒరిజినల్ సీసీఆర్‌సీ కార్డు, ఆధార్, ఫొటోలను సహకార సంఘంలోని కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పక్కాగా ఈ–క్రాప్ నమోదు

మద్దికెర: మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను పక్కాగా ఈ క్రాప్ నమోదు చేస్తున్నట్లు ఏఓ రవి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాలలో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో 16 వేల ఎకరాలలో రైతులు వివిధ పంటలు సాగు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 4100 ఎకరాలకు సంబంధించి ఈ–క్రాప్ నమోదైనట్లు చెప్పారు. మరింత వేగవంతంగా నమోదు చేయాలని వీఏఏలకు ఆదేశాలు ఇచ్చామన్నారు. వీఏఏ జాకీర్ వెంట ఉన్నారు.

‘ఆడుదాం - ఆంధ్ర’కు సర్వం సిద్ధం



గోనెగండ్ల జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఏర్పాట్లును పరిశీలస్తున్న అధికారులు

గోనెగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యం వెలికి తీసేందుకు ప్రభుత్వం డిసెంబర్ 15వ తేదీ నుంచి సచివాలయ స్థాయిలో ఆడుదాం- ఆంధ్ర క్రీడాపోటీలను నిర్వహిస్తోంది. క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే అన్ని గ్రామ పంచాయతీల్లో క్రీడా మైదానాలను అధికారులు సిద్ధం చేశారు. గోనెగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈఓ సతీష్ ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ సిబ్బంది క్రీడా మైదానాన్ని సిద్ధం చేశారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఈనెల 15 నుంచి 20 వరకు, మండలస్థాయిలో 21వ తేదీ నుంచి జనవరి 4 వరకు క్రీడా పోటీలు జరుగుతాయన్నారు మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో 3500 మంది క్రీడాకారులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. క్రీడాపోటీలను పక్కాగా నిర్వహించి విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారు.

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం–ఆంధ్ర క్రీడా పోటీలను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అల్లబకష్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. క్రీడాకారుల రిజిస్ట్రేషన్ దాదాపు పూర్తయినట్లు చెప్పారు. ప్రతి సచివాలయం పరిధిలో నిర్దేశించిన క్రీడలకు పురుషులు, మహిళా జట్లను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. 15వ తేదీన ప్రారంభమయ్యే క్రీడల నిర్వహణకు పీడీలు, పీఈటీలు గ్రౌండ్‌లను సిద్ధం చేస్తున్నారని చెప్పారు.

అద్దె చెల్లించని దుకాణదారులకు నోటీసులు

ఆలూరు రూరల్: మేజర్ గ్రామ పంచాయతీ కాంప్లెక్స్‌లో వివిధ రకాల వ్యాపారం చేసుకుంటూ అద్దె చెల్లించని వారికి బుధవారం గ్రామ పంచాయతీ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏడాదిగా అద్దె చెల్లించని, పెండింగ్ బకాయిలు ఉన్న వారికి వారంలోగా నగదు, లేదా బ్యాంకు చలానా రూపంలో చెల్లించాలని సూచించారు. లేకపోతే షాపులు ఖాళీ చేయించి ఇతరులకు కేటాయిస్తామన్నారు. ఇందులో భాగంగా 22 షాపులకు నోటీసులు అందించినట్లు ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు తెలిపారు.

వైభవంగా భీరలింగేశ్వరుడి దేవర



స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్న అశేష భక్తజనం

నందవరం: నందవరంలో వెలసిన కురబల కుల దైవం భీరలింగేశ్వరుడి దేవర ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. డోలు వాయిద్యాలు.. గొరవయ్యల సంప్రదాయ చిందులు.. మురళిగానాలు.. అశేష భక్తజనం మధ్య పురవీధుల్లో స్వామి ఊరేగింపు రమణీయంగా సాగింది. మంగళవారం భీరప్ప దేవాలయం నుంచి గ్రామ పెద్దలు, భక్తులు ప్రత్యేక పల్లకీలో భీరలింగేశ్వరుని విగ్రహాన్ని తుంగభద్ర నదికి తీసుకెళ్లి జలాభిషేకం చేసి, పూజలు నిర్వహించారు. అనంతరం పవిత్ర గంగాజలం తీసుకొచ్చి గ్రామంలోని ఆలయాల్లోని దేవతామూర్తులకు జలాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ కట్ట పరిధిలోని 72 గ్రామాల పూజారులు బండారితో పాల్గొని పూజలు గావించారు. స్వామి వారికి భక్తులు పిండి వంటలతో నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆయా గ్రామాలతో పాటు కర్ణాటకలోని రాయచూరు, సింధునూర్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డిగౌడ్, గ్రామ సర్పంచ్ తోట సామిత్రి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, విడిది ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ తిమ్మయ్య పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఆస్పరి: ఆధ్యాత్మికత, దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి సూచించారు. మండలంలోని పుటకలమర్రి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ధార్మిక సప్తహ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన సనాతన భారతీయ వైదిక ధర్మవ్యాప్తి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రవచకులు పీవీ రమణమూర్తి శ్రీమద్రామాయణంపై చేసిన ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. సర్పంచ్ విశాలాక్షి, గ్రామ పెద్దలు శివారెడ్డి, నాగరాజు, రామాంజినేయులు, జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

మిర్చి దిగుబడుల అపహరణ

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో ఈడిగ లక్ష్మన్న అనే రైతు పొలంలోని మిర్చి దిగుబడులను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. ఈడిగ లక్ష్మన్న తనకున్న రెండెకరాలలో మిర్చి పంటను సాగుచేశాడు. పంట అరకొరగా పండింది. వచ్చిన 6 క్వింటాళ్ల పంటను పొలంలో ఆరబోసుకొని ఉండగా దాదాపు 2 క్వింటాళ్ల వరకు దొంగలు ఎత్తుకెళ్లారని రైతు వాపోయాడు. బుధవారం తెల్లవారుజామున మళ్లీ వచ్చిన దుండగులు ఏడు బస్తాలలో ఎండుమిర్చిని నింపుకొని తీసుకెళుతుండగా యజమాని గుర్తించి కేకలు వేయడంతో బస్తాలను అక్కడే వదిలి పరారయ్యారు. బాధిత రైతు పోలీసులకు సమాచారం అందించడంతో వారు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. అలాగే బుధవారం మధ్యాహ్నం సుజాత అనే మహిళ ఇంటి వద్ద నిద్రిస్తుండగా దొంగలు మంగళసూత్రం గొలుసు లాక్కుని ఉడాయించారు. గ్రామంలో వరుస దొంగతనాలు జరగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



విద్యార్థులు తయారు చేసిన నమూనా ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈఓలు



పత్తికొండ బాలుర హైస్కూల్‌లో చంద్రయాన్-3 నమూనా ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంఈఓ

హొళగుంద: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలతో ఆకట్టుకున్నారు. హెచ్ఎం నజీర్ అహమ్మద్, పీఎంసీ చైర్మన్ మజ్జిగ సిద్ధయ్య, ఎంఈఓలు జగన్నాథం, సత్యనారాయణ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డేవిడ్, ఎల్లార్తి హైస్కూల్ హెచ్ఎం శివశంకర్‌రెడ్డి, తదితరులు హాజరై కార్యక్రమన్ని ప్రారంభించారు. విద్యార్థులు తాము తయారుచేసిన నమూనా ప్రాజెక్టులను ప్రదర్శించారు. చిరుధాన్యాలు, సోలార్, స్మార్ట్ సిటీ, విద్యుత్ ఉత్పత్తి, గాలి మరలు, రాకెట్ తదితర సైన్స్, మ్యాథ్స్‌లోని పలు అంశాలకు సంబంధించి ప్రదర్శనలు నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థినులు ప్రవల్లిక, పూజ, అనుష్క, టీచర్ విభాగంలో కేజీబీవీ టీచర్ మాధురి తయారు చేసిన మోడల్స్ జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికై నట్లు హెచ్ఎం తెలిపారు.

పత్తికొండ రూరల్: విద్యార్థులు సైన్స్ విజ్ఞానంపై పట్టు సాధించాలని ఎంఈఓ రమేష్ అన్నారు. బుధవారం పత్తికొండ ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన మండల సైన్స్ ఫేర్‌ను ఇన్‌చార్జి హెచ్ఎం ఉస్మాన్‌బాషా, పీఎంసీ చైర్మన్ మధుబాబు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన నమూనా ప్రాజెక్టులను పరిశీలించారు. వ్యక్తిగత, గ్రూపులుగా తయారు చేసిన నమూనాలను మూడు కేటగిరీలుగా ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపిస్తామన్నారు.

15 నుంచి ధనుర్మాస పూజలు

హొళగుంద: మండల కేంద్రంలో వెలసిన సిద్ధేశ్వర స్వామికి ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు ధనుర్మాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు, వంశ పారపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్ తెలిపారు. ఆలయంలో నిత్య రుద్రాభిషేకం పూజలు నెల రోజులు పాటు జరుగుతాయని చెప్పారు. ఆలయ ధర్మకర్త, అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయని, భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి చర్యలు

మద్దికెర: ప్రభుత్వం నీతి ఆయోగ్ సౌజన్యంతో ఆస్పిరేషనల్ బ్లాక్స్‌లో ఎంపిక కాబడిన అంగవైకల్యం గలవారిని గుర్తించి అవసరమైన ఉపకరణాలు అందిస్తుందని, ఈనెల 16వతేదీ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేసుకుంటారని ఎంపీడీఓ నరసింహామూర్తి బుధవారం తెలిపారు. శిబిరంలో హాజరయ్యే వికలాంగులు సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఒరిజినల్స్‌తో పాటు ఒకసెట్ జిరాక్స్ పత్రాలను వెంట తీసుకురావాలన్నారు. ఎంపికైన వారందరికీ జనవరిలో ఉపకరణాలు అందజేస్తారని తెలిపారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

తుగ్గలి: విద్యార్థులకు చదువుతో పాటు వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తూ వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ ప్రోత్సహించాలని ఎంపీటీసీ సభ్యుడు రాజు అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులతో కలిసి తిలకించారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నారు.

జగనన్నతోనే జనరంజక పాలన



ఎమ్మిగనూరు 33వ వార్డులో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్/గోనెగండ్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ నాలుగున్నరేళ్లుగా జనరంజక పాలన సాగిస్తోందని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇవ్వాలని పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం పట్టణంలోని 33వ వార్డులో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ వీరేష్‌లతో కలిసి, సాయంత్రం పెద్ద మరివీడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన కుటుంబాలను కలిసి బుక్‌లెట్లు ఇచ్చి ఆయా పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారం గయ్య, నజీర్‌అహమ్మద్, యుకె రాజశేఖర్, షబ్బీర్ అహమ్మద్, అమాన్, ఇషాక్, సుధాకర్, ప్రతాప్‌రెడ్డి, విశ్వనాథ్‌రమేష్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రఫీక్, మన్సూర్, బందెనవాజ్, నరసన్న ఆచారి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రితో విభేదాలు లేవు



మాట్లాడుతున్న బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ

ఆలూరు: కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంతో తమకు ఎలాంటి వర్గ విభేదాలు లేవని అన్నాచెల్లెలిగా మెలుగుతామని బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ అన్నారు. ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 24న నిర్వహించతలపెట్టిన మాదాసి, మాదారి కురువల సింహగర్జన కార్యక్రమం నిర్వహణపై బుధవారం స్థానిక కురువ నాయకులు దేవేంద్రప్ప, జయరాం, దిబ్బనకంటి రంగన్న, నాగరాజ్, పెద్దయ్య, దేవేంద్రప్ప, దగ్గన్న తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శశికళ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కురువలు, వాల్మీకులు సోదరభావంతో కలిసి ఉంటున్నారన్నారు. అట్టడుగు వర్గాలకు చెందిన కురువ కులస్తులకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు, రాజకీయాలలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు



తిప్పనూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



వెల్దుర్తిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి

గోనెగండ్ల: అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్ జగనన్నను మరోమారు సీఎంగా గెలిపించుకుందామని జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మిదేవి పిలుపునిచ్చారు. మండలంలో తిప్పనూరు గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ వివరాల బోర్డును వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ పరిధిలో వివిధ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించారు. పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, ఎంపీటీసీ హరిత, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దారెడ్డి, శ్రీనివాసులు, వెంకటేష్, లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రతి పేద కుటుంబం సంక్షేమానికి, ప్రతి గ్రామం అభివృద్ధికి పాటు పడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాబోవు ఎన్నికలలో మళ్లీ గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ వెల్దుర్తి మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని సచివాలయం–2 పరిధిలో బుధవారం ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్, సర్పంచ్ ముత్యాల శైలజ, ఈఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సచివాలయ పరిధిలో రూ.32 కోట్ల మేర అమలు చేసిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం 2వ వార్డులోని వీరభద్రస్వామి కట్ట వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ, గత టీడీపీ చేసిన మోసాలను ఎండగట్టారు. జెడ్పీటీసీ సుంకన్న, నాయకులు బొమ్మన పెద్దిరెడ్డి, గట్టు ఆరిఫ్, రఘురెడ్డి, శివారెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందని పార్టీ మండల కన్వీనర్ మల్లికార్జున పిలుపునిచ్చారు. మండలంలోని వెలమకూరు గ్రామంలో ‘ఏపీకి జగనే మళ్లీ ఎందుకు కావాలి’ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు లుముంబా, రామచంద్ర, వీరభద్రి తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప మాలధారులు

హొళగుంద: మండల కేంద్రంలో బుధవారం అయ్యప్ప మాలధారులు శబరిమలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాలధారులు ఉదయమే స్థానిక అయ్యప్ప ఆలయం వద్దకు చేరుకుని స్వామి విగ్రహానికి పూలు, పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణ ఇతర ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని, మెట్లను దీపాలు, రంగురంగుల పూలతో అలంకరించిన దృశ్యం భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అనంతరం మాలధారులను శబరిమలకు కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు సాగనంపారు.

నేడు సామాజిక తనిఖీ సభ

నందవరం: మండలంలో 2022–2023 మధ్య చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దశరథ రామయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి పనులపై గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉపాధి కింద 1584 పనులకు గానూ రూ.11.43 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఆయా పనులపై ఒక ఎస్ఆర్పీ, 6 మంది డీఆర్పీలు 8 రోజులపాటు తనిఖీ చేపట్టారన్నారు. బహిరంగ సభకు మండల అధికారులు, ఉపాధి సిబ్బంది, వెలుగు సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

కృష్ణగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ మురళీమోహన్ సూచించారు. మండల పరిధిలోని చిట్యాల, కోయిలకొండ గ్రామ సచివాలయాల్లో బుధవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల అభ్యున్నతికి కేంద్రం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం గ్రామస్తులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను అందజేశారు. సర్పంచ్‌లు రాజేశ్వరగౌడ్, లక్ష్మిఈశ్వరయ్య, వైద్యాధికారి వరప్రసాద్, రామలింగం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.